
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
మంగళవారం 2 ఏప్రిల్ 2024



గురుకుల ప్రవేశ దరఖాస్తుకు 5 వరకు గడువు పెంపు

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం ఈ నెల ఐదో తేదీ వరకు పెంచిందని గురుకుల జిల్లా సమన్వయకర్త జె.నాగ సంధ్యభార్గవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31వ తేదీ ఆఖరు కాగా, తాజాగా ప్రభుత్వం మరో ఐదు రోజులు పెంచిందని, ఆసక్తి వున్న అభ్యర్థులు http://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల ఐదో తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సిరులు కురిపిస్తున్న మిరియాలు

కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాల పాదులు

ఏజెన్సీ వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో ఉంటాయని అంచనా

ఈ ఏడాది ఆశాజనకంగా ధర

కిలో రూ.510 నుంచి రూ.550 కొనుగోలు

పాడేరు/అరకులోయ, ఏప్రిల్ 1: ఏజెన్సీలో కాఫీ తోటలున్న గిరిజన రైతులకు మిరియాలు సిరులు కురుపిస్తున్నాయి. కాఫీ తోటలకు నీడనిచ్చేందుకు ఉండే పొడుగాటి సిల్వర్ ఓక్ చెట్లకు మిరియాల పాదులు అల్లుకుంటాయి. దీంతో కాఫీ తోటల్లో అంతర పంటగా ఎటువంటి పెట్టుబడి లేకుండా మిరియాలు నుంచి గిరి రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది.

ఏజెన్సీ వ్యాప్తంగా 2 లక్షల 58 వేల ఎకరాల్లో ఉన్న కాఫీ తోటల్లో సుమారుగా 30 వేల ఎకరాల్లో మిరియాల పాదులుంటాయనేది ఒక అంచనా. ఒక ఎకరం కాఫీ తోటల్లోని మిరియాలు దిగుబడి ద్వారా గిరిజన రైతులకు ఏడాదికి రూ.30 వేలు నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో కాఫీ తోటలున్న గిరిజన రైతులు మిరియాల పాదుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

జోరుగా మిరియాలు క్రయ విక్రయాలు

ప్రస్తుతం మన్యంలో మిరియాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలుచోట్ల రైతులు చెట్లకున్న పాదుల నుంచి మిరియాలను సేకరిస్తుండగా, వారపు సంతల్లో మరికొందరు వాటిని విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ధర ఆశాజనంగా ఉంది. కిలో రూ.510 నుంచి రూ.550 పలుకుతోంది. రైతుల వద్ద కొనుగోలు చేసిన మిరియాలను వర్తకులు దేశీయ మార్కెట్లున్న భువనేశ్వర్, కటక్, కర్ణాటక, కోల్‌కతాకు తరలిస్తుంటారు. మరో రెండు వారాలు మిరియాల క్రయ విక్ర యాలు జరుగుతాయని వర్తకులు, రైతులు చెబుతున్నారు.



పాడేరు మండలం మోదాపల్లి ప్రాంతంలో మిరియాలు సేకరిస్తున్న గిరి రైతు



అరకులోయలో మిరియాలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

మిరియాలు ధర ఆశాజనకంగా ఉంది



గత ఏడాది కంటే ఈ ఏడాది మిరియాల ధర ఆశాజనకంగా ఉంది. గతేడాది కిలో రూ.400 నుంచి రూ.450 కి విక్రయించాం. అయితే ఈ ఏడాది తాజాగా కిలో రూ.510 ధరతో 150 కిలోల మిరియాలు విక్రయించాను. దీంతో ఈ ఏడాది కాఫీ తోటల్లోని మిరియాల ద్వారా రూ.76 వేల ఆదాయం పొందాను. ఏజెన్సీలో మిరియాలకు ప్రభుత్వపరంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో వర్తకులు నిర్ణయించిన ధరపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

-తడబారికి ఈశ్వరరాజు,
రైతు, సోవ్వ గ్రామం, డుంబ్రిగుడ మండలం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయసునీత, పక్కన డీఆర్‌డీఏ పీడీ మురళి

గ్రామాల్లోనే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరిన కలెక్టర్

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్యాంకులు తక్కువగా ఉండడంతో పాటు గ్రామాలు సైతం దూరంగా ఉండడం వల్ల గ్రామాల్లోనే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేసేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ ఎం.విజయసునీత కోరారు. వేసవి నేపథ్యంలో తాగునీరు, విద్యుత్, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామాలు దూరంగా ఉండడంతో ఆయా గ్రామాల నుంచి గ్రామ సచివాయాలకు లబ్ధిదారులు వచ్చి పింఛన్లను పొందడం కష్టంగా ఉంటుందని, అందువల్ల ఆయా గ్రామాల్లోనే పింఛన్లు పంపిణీ చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, తాగునీటి సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

చింతపల్లిలో 37 డిగ్రీలు

చింతపల్లి, ఏప్రిల్ 1: మన్యంలోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం చింతపల్లిలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా గిరిజన ప్రాంతంలో ఏప్రిల్ నెలాఖరు వరకు 35- 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతుంది. మే నెలలో 38-40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అయితే ఈ ఏడాది ఏప్రిల్ ప్రారంభంలోనే 37 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా రానున్న రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అరకులోయలో అయోమయం!

కూటమి తరపున ఇద్దరు అభ్యర్థుల ప్రకటన

- ఎవరు పక్కాగా బరిలో ఉంటారో కొరవడిన స్పష్టత
- ప్రచారాన్ని నిలిపివేసిన దొన్నుదొర
- గందరగోళంలో కూటమి శ్రేణులు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

అరకులోయ అసెంబ్లీ స్థానానికి కూటమి తరపున టీడీపీ, బీజేపీలు ఇద్దరు అభ్యర్థులను ప్రకటించడంతో ఆయా పార్టీల కేడర్ అయోమయంలో పడింది. ఈ ఏడాది జనవరి 20న అరకులోయలో జరిగిన టీడీపీ 'రా.. కదలిరా' బహిరంగ సభలో తమ పార్టీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా దొన్నుదొరను ఆ పార్టీ అధినేత నారాచంద్రబాబు నాయుడు ప్రకటించారు. దీంతో అప్పటి నుంచి దొన్నుదొర తన నియోజకవర్గంలో ప్రచారం చేపడుతున్నారు. కాగా అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా పాంగి రాజారావును గత నెల 27న భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. దీంతో ఎవరు బరిలో ఉంటారో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.



టీడీపీ అభ్యర్థి దొన్నుదొర




బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు

సందిగ్ధంలో కూటమి కేడర్

అరకులోయ అసెంబ్లీ స్థానానికి టీడీపీ, బీజేపీ వేర్వేరుగా తమ అభ్యర్థులను ప్రకటించడంతో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి కేడర్ అయోమయంలో పడింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఏ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రజలను కోరాలో అర్థం కాక ... మిగతా 8వ పేజీలో

కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్ల సాధన



కేఎస్ భరత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 1: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లో తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ఆటగాళ్లు సోమవారం సాయంత్రం ముమ్మర సాధన చేశారు. కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తోపాటు లోకల్ బాయ్ కేఎస్ భరత్, రింకూ సింగ్, నితీష్ రాణా, రూథర్‌ఫోర్డు, గుర్బాజ్, మనీష్ పాండే, సాల్ట్, రఘువన్షీ, వెంకటేష్ అయ్యర్, రమణదీప్‌సింగ్, అనుకుల్ రాయ్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్, హర్షిత్ రాణా, చమీర్‌లు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. ఆటగాళ్లకు కోచ్ చంద్రకాంత్ పండిట్ సూచనలు చేశాడు. ఇక సీఎస్‌కేపై సాధించిన విజయంతో ఉత్సాహంగా ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన ఆటగాళ్లు సిద్ధార్థ్ కౌల్, ఇషాంత్‌శర్మ, లలిత్ యాదవ్, సుమిత్‌కుమార్, ప్రవీణ్ దుబే, ఖలీల్ అహ్మద్, కులదీప్‌యాదవ్ సాధన చేశారు. కొందరు వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో, మరికొందరు ప్రధాన గ్రౌండ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు.



శ్రేయాస్ అయ్యర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

వైసీపీకి మరోసారి అధికారం ఇస్తే ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం

- గిరిజన సంపదను దోచేస్తుంది
- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ఆరోపణ

చింతపల్లి, ఏప్రిల్ 1: వైసీపీకి మరోసారి అధికారం కట్టబెడితే గిరిజన సంపదను దోచేస్తుందని, ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆదివాసీలు అత్యంత విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. గిరిజనుల ఓట్లతో శాసనసభకు వెళ్లిన ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆదివాసీ హక్కులు, చట్టాలను కాపాడలేదన్నారు. ముఖ్యమంత్రి స్వప్రయోజనాలకు గిరిజన చట్టాలు, హక్కులను కార్పొరేట్ సంస్థలు, ఆదివాసేతరులకు తాకట్టు పెడుతుంటే మౌనంగా మద్దతు ఇస్తున్నారన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో గిరిజన ప్రాంత ప్రజలకు తీరని నష్టం జరిగిందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం జీవో నంబరు-3ను రద్దు చేయడం వల్ల ఆదివాసీ నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారన్నారు. జీవో నంబరు పునరుద్ధరణకు గిరిజన సలహా మండలిలో తీర్మానం చేసినప్పటికి వైసీపీ ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేయలేదని, కనీసం గవర్నర్‌కు కూడా పంపించలేదన్నారు. గిరిజన ... మిగతా 8వ పేజీలో

మోదకొండమ్మ ఉత్సవాలపై కోడ్ ప్రభావం!

- వచ్చే నెల 19, 20, 21 తేదీల్లో ఉత్సవాలు
- నిర్వహణకు దూరమైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- అధికార యంత్రాంగం కల్పించుకోవాలని భక్తుల వేడుకోలు
- ఉత్సవాలకు నిధులు ఇవ్వాలని కోరుతున్న ఉత్సవ కమిటీ

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది మే నెల 19, 20, 21 తేదీల్లో జరిగే స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలపై ఎన్నికల కోడ్ ప్రభావం పడనుంది. ఇప్పటికే కోడ్ అమల్లో ఉండడంతో ఉత్సవాల తేదీల ఖరారుకు నిర్వహించిన సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాని పరిస్థితి నెలకొంది. ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ముమ్మరంగా ఎన్నికల హడావిడి ఉండే మే నెలలో పరిస్థితి ఏమిటోనని భక్తులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ హోదాలో ఆలయ, ఉత్సవ కమిటీల సమన్వయంతో ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేవారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎమ్మెల్యే కావడంతో అధికారులు, అనధికారులు ఉత్సవాల నిర్వహణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించేవారు. కానీ ఎన్నికల కోడ్ ప్రభావంతో ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. దీంతో ఉత్సవాలకు ... మిగతా 8వ పేజీలో





పాడేరు మోదకొండమ్మ ఆలయం. (ఇన్‌సెట్లో) అమ్మవారు



పాడేరులో టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

సజావుగా టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం సజావుగా ప్రారంభమైంది. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 65 పరీక్షా కేంద్రాల్లో 12,051 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాశారు. వారిలో 10,986 మంది రెగ్యులర్, 1,065 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. వారందరికీ సంబంధించి మొత్తం 90 వేల జవాబు పత్రాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయనున్నారు. అందుకు గాను 520 మంది ఉపాధ్యాయులను నియమించారు. సుమారుగా వారం రోజులు ఈ ప్రక్రియ కొనసాగుతుందని డీఈవో తెలిపారు. తొలి రోజు మూల్యాంకన ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు.

వలంటీర్ల నుంచి ట్యాబ్‌ల స్వాధీనం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు యంత్రాంగం చర్యలు

జిల్లా వ్యాప్తంగా 352 సచివాలయాల్లో 5,670 మంది వలంటీర్లు

-వార్త 8వ పేజీలో...

554 కిలోల గంజాయి స్వాధీనం

పట్టుబడిన బాలుడు, ఆరుగురు వ్యక్తులు

-వార్త 7వ పేజీలో...

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.14
సహరి (బుధ)	4.36


గోదావరి డెల్టా రబీ పంటలకు నీరు విడుదల

డొంకరాయి జలాశయం నుంచి 3,500 క్యూసెక్కులు

విద్యుదుత్పత్తి అనంతరం మరో 3,500 క్యూసెక్కులు

ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

సీలేరు, ఏప్రిల్ 1: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు మార్చి 10 నుంచి సీలేరు కాంప్లెక్సులోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అయితే రబీ పంటలకు విద్యుదుత్పత్తి అనంతరం విడుదల అవుతున్న నీరు సరిపోకపోవడంతో ఇరిగేషన్ అధికారులు డొంకరాయి నుంచి అదనంగా మరో 3,500 క్యూసెక్కుల నీటిని ఐదు రోజుల పాటు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారులను కోరారన్నారు. దీంతో తమ ఉన్నతాధికారులు ... మిగతా 8వ పేజీలో





డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) నీరు విడుదల కోసం డొంకరాయి జలాశయం గేట్ల స్విచ్‌ను నొక్కుతున్న ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సీఈ శ్రీధర్

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య

చీడికాడ, ఏప్రిల్ 1: మండలంలోని శిరిజాం గ్రామానికి చెందిన ఓ యువకుడు కుటుంబ కల హాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ బి.నారాయణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శిరిజాం గ్రామానికి చెందిన విస్సారపు గణేశ్(19) చదువు మధ్యలో ఆపేసి ఖాళీగా ఉంటున్నాడు. తల్లిదండ్రులతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మేడపై గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఇది గమనించి వెంటనే కుటుంబ సభ్యులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్టు చెప్పారు. ఆ యువకుడి తండ్రి ముత్యాలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శారదా నది పక్కన గుర్తు తెలియని మృతదేహం

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 1: మునగపాక మండలం ఉమ్మలాడ వద్ద శారదా నది పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్టు ఎస్ఐ బి.ప్రసాదరావు తెలిపారు. ట్రైనీ డీఎస్పీ, సీఐ గఫూర్‌లతో కలిసి మృతదే హాన్ని పరిశీలించామని, క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించిందని చెప్పారు. మృతుని వయసు సుమారు 60 ఏళ్లు వుంటాయని, తెల్ల చొక్కా, పంచె ధరించి వున్నాడని, చేతికి కడియం ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు 94407 96087 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఎస్ఐ ప్రసాదరావు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తూ కాలువలో పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 1: కాలువ దాటుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మండలం పెదగొల్లలపాలెం రామాలయం వీధిలో కసిరెడ్డి సంతోశ్ (30) భార్య గౌరి, నాలుగు నెలల కుమార్తెతో నివాసం ఉంటున్నాడు. అనకాపల్లి లారీ యార్డులో డ్రైవర్‌గా పని చేస్తున్న సంతోశ్ ఆదివారం ఉదయం విధులకు వెళ్లి రాత్రయినా ఇంటికి చేరలేదు. అయితే సంతోశ్ అనకాపల్లి వెళ్లి అక్కడ నుంచి ఇంటికి చేరుకునేందుకు కూర్మన్నపాలెం వచ్చాడు. ఇక్కడ రోడ్డు పక్కన ఉన్న కాలువ దాటుతుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంతోశ్ మృతి చెందినట్టు పోలీసుల నుంచి సమాచారం రావడంతో గౌరి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. ఆమె ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 : పదో తరగతి పరీక్ష రాయడానికి ఇంటి నుంచి బయలుదేరిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. బాలిక తల్లి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ పీవీ రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కృష్ణాపురం కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని గత నెల 30వ ఒకేషనల్ పరీక్ష రాయడానికి పరీక్షా కేంద్రానికి ఇంటి నుంచి బయలుదేరింది ఆదివారం సాయంత్రం ఇంటికి చేరకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించక తల్లి అమ్మాజీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మడ్డువలస రిజర్వాయర్‌లో మత్స్యకారుడు మృతి

వంగర, ఏప్రిల్ 1: విజయనగరం జిల్లా వంగర మండలంలోని మడ్డువలస రిజ ర్వాయర్‌లో వేటకు వెళ్లిన అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన మత్స్య కారుడు కొమ్మర దేవుడు(47) పటువర్ధనం సమీపంలో నాటుపడవ బోల్తాపడి మృతిచెందాడు. పటువర్ధనం గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. రిజర్వాయర్‌లోకి నాటుపడవతో సోమవారం సాయంత్రం దేవుడు వెళ్లాడు. నదిలోకి వెళ్లిన కొద్దిసేపటికే నాటుపడవ గాలులకు బోల్తాపడింది. దీంతో చేపలకు వేయడానికి సిద్ధంచేసిన వలకు చిక్కుకుని మృతి చెందాడు. వేటకు వెళ్లిన దేవుడు చీకటిపడిన వరకు రాకపోవడంతో కంగారు పడిన భార్య సూకమ్మ గ్రామంలో తోటి మత్స్యకారులకు విషయం తెలియజేసింది. దీంతో నది వద్దకు వెళ్లిన మత్స్యకారులు బోల్తాపడిన బోటు, వలకు చిక్కుకుని ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే అప్పటికే మృతిచెం దినట్లు గుర్తించారు. దేవుడు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి పొట్టపోషణకు పటువర్ధనం వచ్చాడు. ఇక్కడ మడ్డువలస రిజర్వాయర్‌లో చేపల వేట సాగించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యాంతమయ్యారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దేవుడు మృతి విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకోసం రాజాం తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

గంజాయి కేసులో 20 సంవత్సరాల జైలుశిక్ష

ఖమ్మంలీగల్, ఏప్రిల్ 1 : గంజాయి రవాణా కేసులో నిందితులకు 20సంవత్సరాల జైలుశిక్ష, లక్షరూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయి, విశాఖపట్నం రూరల్ జిల్లా నర్సీపట్నం గ్రామానికి చెందిన టి.వెంకటసత్యనారాయణ, ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన గుంజి నాగరాజు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. 2021లో ఖమ్మం రూరల్ పోలీసులు కోదాడ క్రాస్‌రోడ్‌లో తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను తనఖీ చేశారు. వారి నుంచి 170 కేజీల 190గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువుకావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు.

ఎన్నికల తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతు

- కూటమి పార్టీల్లో చేరడానికి క్యూ కడతారు
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- టీడీపీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం



టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని, ఆ పార్టీ నాయకులంతా కూటమి పార్టీల్లో చేరేందుకు క్యూ కడతారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి సీఎం రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కార్యాలయం వద్ద ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో టీడీపీ నాయకులంతా గత 40 ఏళ్లుగా తనకు పరిచయస్తులేనని చెప్పారు. మూడు పార్టీల పొత్తుతో వైసీపీ నాయకులు బెంబేలెత్తిపోతున్నారని, ఆ పార్టీకి చెందిన అధికారిక మీడియా కూటమిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాదని ఆరోపించారు. ఎన్నికల తరువాత వైసీపీ ఖాళీ అవుతుందని, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సబ్బారెడ్డి వంటి వారు కూడా కూటమి పార్టీల్లో చేరేందుకు క్యూ కడతారని ఎద్దవా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి అధికారం ఇచ్చి, జిల్లాకు చెందిన బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్‌లకు మంత్రులుగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేయలేదన్నారు. మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్న వీరిని జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో 22 మంది ఎంపీలను గెలిపిస్తే, అభివృద్ధి పనుల గురించి సీఎం జగన్‌తో ఒక్కసారైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడంలోచ జగన్ పీజీ చేశారని, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీ అంటూ ఆయా వర్గాలను అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. అవినీతితో సంపాదించిన సొమ్మును పంచి వచ్చే ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నాడని, నోటుకు ఓటును అమ్ముకొనే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, బీసీ విభాగం నాయకుడు మాదంశెట్టి నీలబాబు, ఎస్సీ విభాగం నాయకుడు సబ్బవరపు గణేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత

- విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధుల సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాల్లో ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత అని, అధ్యాపకులు విద్యార్థుల వ్యవహారశైలి, మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి ఆత్మస్థైర్యాన్ని పెంచాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లాలో వివిధ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులతో ర్యాగింగ్, వివిధ రూపాల్లో జరిగే వేధింపులు, ఇతర సమస్యల నివారణపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాజమాన్యాలు తల్లిదండ్రులు, విద్యార్థులతో తరచూ సమావేశాలు నిర్వహించి ర్యాగింగ్, ఇతరత్రా వేధింపు చర్యలపై చర్చించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యా సంస్థల్లో సీసీ టీవీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. టెర్రస్‌పైకి, వాటర్ ట్యాంకు వద్దకు విద్యార్థులు వెళ్లకుండా కళాశాల యాజమాన్యాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ర్యాగింగ్ సంస్కృతిని నివారించేందుకు కళాశాలల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలలో స్థానిక పోలీసులను, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. ర్యాగింగ్ నిరోధానికి 112 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

554 కిలోల గంజాయి స్వాధీనం

- పట్టుబడిన బాలుడు, ఆరుగురు వ్యక్తులు
- పరారీలో మరో ముగ్గురు



పట్టుబడిన నిందితులతో ఏఎస్పీ, కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల సిబ్బంది



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, వాహనాలు

కొయ్యూరు, ఏప్రిల్ 1: మండలంలోని చీడిపాలెం గ్రామ శివారు దొడ్డవరం- కాకరపాడు ప్రధాన రహదారిలో పోలీసులు ఆదివారం సాయంత్రం 554 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, బాలుడితో పాటు ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. దీనికి సంబంధించి కొయ్యూరు సీఐ వెంకటరమణ సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

భారీగా గంజాయి తరలిస్తున్నట్టు ఆదివారం మధ్యాహ్నం కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణకు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో ఆయన మండలంలోని చీడిపాలెం గ్రామ శివారు దొడ్డవరం- కాకరపాడు ప్రధాన రహదారిలో సాయంత్రం నాలుగు గంటలకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో బూదరాళ్ల నుంచి ముందు ఓ ద్విచక్ర వాహనం, దాని వెనుక జీపుతో పాటు మరో ద్విచక్ర వాహనం రావడాన్ని పోలీసులు గమనించారు. పోలీసులను చూసి వాళ్లు తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే వారిలో ఓ బాలుడు, ఆరుగురు వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మరో ముగ్గురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారు జీకే వీధికి చెందిన బాలుడు, చింతపల్లి మండలం అన్నవరం గ్రామానికి చెందిన సిందేరి సుబ్బారావు, జీకే వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ కొత్తవాడ గ్రామానికి చెందిన పాంగి ప్రసాద్, వంతల శివయ్య కొర్రా గిరి, పాంగి శాలు అలియాస్ రమణతో పాటు ఇదే పంచాయతీ బూరుగుపాకలు గ్రామానికి చెందిన జీపు డ్రైవర్ కిల్లో బాలరాజుగా పోలీసులు గుర్తించారు. జీపులో ఉన్న 10 బస్తాల్లో గల 554 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీన్ని ఒడిశా రాష్ట్రం చింతలధూళి గ్రామంలో సుప్ర అనే వ్యక్తి నుంచి కిలో రూ.1200 లు చొప్పున కొనుగోలు చేసినట్టు పోలీసులకు నిందితులు తెలిపారు. ఈ గంజాయిని దిగువజనభ, చెరువూరు, కోరుకొండ మీదుగా కుడుముల వీరవరం వరకు జీపులో తరలించారు. అక్కడ నుంచి గంజాయిని కూలీలకు అప్పగించి సుర్తిపల్లి మీదుగా కొత్తవాడకు కొండ మీద నుంచి బస్తాలు కట్టి మోసుకుంటూ శనివారం రాత్రి తీసుకువచ్చారు. అప్పటికే అక్కడకు చేరుకున్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పీనారిపాలేనికి చెందిన నొట్ల చినరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఈ గంజాయిని రీముల ప్రసాద్ అనే వ్యక్తి జీపులో లోడు చేయించి కిల్లో బాలరాజు జీపు డ్రైవర్‌గా, అతనికి సహాయకుడిగా వంతల శివయ్య, కొర్రా గిరితో పాటు పాంగి శాలు అలియాస్ రమణ జీపులో ఉంచి వారికి పైలెట్లుగా జీపు ముందు ఒక ద్విచక్ర వాహనంపై సిందేరి సూరిబాబు, పాంగి ప్రసాద్, పాంగి సత్తిబాబు, జీపు వెనుక మరో ద్విచక్ర వాహనంపై రీముల ప్రశాంత్, పాంగి ధర్మతో పాటు చినరామకృష్ణ బయలుదేరి జెర్రిల, ముల్లుమెట్ట, రింతాడ, పెదవలస, బూదరాళ్ల మీదుగా చీడిపాలెం, కాకరపాడు నుంచి తుని జాతీయ రహదారికి తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితుల్లో బాలుడిని జువైనల్ హోంకు, మిగతా ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. వారి నుంచి గంజాయితో పాటు జీపు, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న నర్సీపట్నానికి చెందిన నొట్ల చినరామకృష్ణ, నీరుతోట పాలేనికి చెందిన పాంగి సత్తిబాబు, జెర్రిల కొత్తూరుకు చెందిన పాంగి ధర్మ కోసం గాలిస్తున్నామని ఆయన చెప్పారు. గంజాయితో పాటు నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ, సిబ్బందిని ఆయన అభినందించారు.

'పోస్టల్ బ్యాలెట్‌పై ముందస్తు ఏర్పాట్లు చేయాలి'

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఎన్నికల రాష్ట్ర ముఖ్య అధికారి ముకేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయానిధి, ఎస్‌డీవో సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అధికార దుర్వినియోగం

- పార్కు స్థలంలో కల్యాణ మండప నిర్మాణం
- ఎన్నికల కోడ్ అమలులో ఉండగా దగ్గరుండి పర్యవేక్షణ
- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే...
- 'స్పందన'లో ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు



పార్కు స్థలంలో నిర్మాణం (అంతర్ చిత్రం) నిర్మాణ ప్రాంతంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఎన్నికల సమయం అని కూడా చూడకుండా అడ్డగోలు వ్యవహారాలు నడుపుతున్నారు. ఒకవర్గం ఓట్ల కోసం ప్రభుత్వ భూమిలో కల్యాణ మంపడం నిర్మాణం చేపడుతున్నారు. దీనిని స్థానికులు ప్రశ్నించినా, లెక్క చేయకుండా దగ్గరుండి మరీ ఆదివారం శ్లాబ్ వేయించారు. ఎన్నికల సమయంలో ఇదేమి పని అంటూ అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. పెందుర్తి సమీపాన చినముషిడివాడ పరిధిలో సర్వే నంబర్లు 101/పి, 102/పిలలో వుడా ఎల్‌పీ నంబరు 78/88తో పార్వతీనగర్ లేఅవుట్ వేసింది. అందులో 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి కోసం భూమి కేటాయించింది. దాని పక్కనే సామాజిక అవసరాలకు పార్కుకు స్థలం విడిచిపెట్టింది. పార్వతీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆ ప్రాంతంలో రామాలయం నిర్మాణం చేపట్టినపుడు 60 అడుగుల రహదారిని కొంత ఆక్రమించారు. దీనిపై పలువురు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు వచ్చి ఆలయ ప్రహరీపై హద్దులు మార్కింగ్ చేశారు. రోడ్డు వేసినప్పుడు ఆ ప్రహరీ తొలగించాలని ఆదేశించారు. ఇదిలావుండగా కొద్ది రోజులుగా రామాలయాన్ని ఆనుకుని ఉన్న పార్కు స్థలంలో కల్యాణ మండపం నిర్మాణం పనులు చేపడుతున్నారు. పార్కు స్థలంలో నిర్మాణం ఎలా చేపడతారంటూ చాలామంది అభ్యంతరం వ్యక్తంచేశారు. ఒక వర్గం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ని ఆశ్రయించింది. ఎన్నికల్లో తనకు అండగా ఉంటే ఆ పనిచేసి పెడతానని, తానే కల్యాణ మండపం నిర్మిస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. అన్నదే తడవుగా పునాదులు తీసి పనులు ప్రారంభించారు. గత రెండు నెలలుగా ఈ వ్యవహారం నడుస్తుండడంతో మార్చి 4వ తేదీన కొందరు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో నాలుగు అంతస్తుల కల్యాణ మండపం నిర్మిస్తున్నారంటూ అధికారులకు తెలియజేశారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఈ సమస్య పరిష్కరించాలని రిఫర్ చేశారు. మార్చి 19వ తేదీలోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు వచ్చి పార్కు స్థలంలో పనులు చేపట్టకూడదని స్పష్టంచేశారు. అయితే దీని వెనుక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఉండడంతో అధికారులు నిర్మాణం జోలికి పోలేదు. ఈ నెల 4వ తేదీ వస్తే ఫిర్యాదు చేసి నెల రోజులు అవుతుంది. ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇదిలావుండగా ఆదివారం (మార్చి 31వ తేదీ) ఎమ్మెల్యే అదీప్ రాజ్ అక్కడికి వచ్చి దగ్గరుండి శ్లాబ్ వేయించారు. సుమారు 45 నిమిషాలు ఆయన అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్న సమావేశం ఏర్పాటుచేయగా, అధికారులు ఏమీ చేయలేరని, తాను అంతా చూసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టడం, పైగా పార్కుకు కేటాయించిన స్థలాన్ని దుర్వినియోగం చేయడం ఎమ్మెల్యే స్థాయి నాయకుడికి తగునా?...అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి వ్యవహారం.. ఓటర్లను లోబరుచుకోవడం కిందకే వస్తుందని, ఆ కోణంలో దీనిపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జూన్ వరకూ ప్రత్యేక రైళ్లు

- జాబితాలో సికింద్రాబాద్, తిరుపతి, బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లు...

విశాఖపట్నం, ఏప్రిల్ 1: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను జూన్ నెలాఖరు వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రతి సోమవారం విశాఖ నుంచి సికింద్రాబాద్ నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ (08579)ను జూన్ 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళవారం సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08580)ను జూన్ 27వ తేదీ వరకు, ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ (08583)ను జూన్ 24వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళవారం తిరుపతి నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08584)ను జూన్ 25వ తేదీ వరకు, ప్రతి ఆదివారం విశాఖ నుంచి బెంగళూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ (08543)ను జూన్ 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08544)ను జూలై ఒకటి వరకు, ప్రతి మంగళవారం విశాఖ నుంచి కర్నూలు సిటీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (08585)ను జూన్ 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీ నుంచి విశాఖ వచ్చే ఎక్స్‌ప్రెస్ (08586)ను జూన్ 26వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అనకాపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వెంకటేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 : అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వేగి వెంకటేశ్‌ను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసినట్టు రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ తెలిపారు. విశాఖకు చెందిన వేగి బాబురావు చాలా కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారని, వెంకటేశ్ కూడా తండ్రి బాటలో నడుస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఏఐసీసీ సభ్యుడిగా, పీసీసీ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్ పనిచేస్తున్నారన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1: గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ పదవ ఏడీజే ఎన్.శ్రీవిద్య సోమవారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ కేవీ మురళీకృష్ణ విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన బూడిద మహాలక్ష్మిప్రసాద్, రాజమహేంద్రవరం కంబాల చెరువుకు చెందిన కుందాం హేమశంకర్‌లు 2015 ఏప్రిల్ 29న పూడిమడకకు వెళ్లే బైపాస్ జంక్షన్‌లో అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు 30 కిలోల గంజాయి తరలిస్తుండగా అప్పటి ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో అరెస్టు చేశారు. కోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ పదవ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీవిద్య తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

'ఏడు నియోజకవర్గాలకు బీజేపీ సమన్వయకర్తల నియామకం'

పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి



విలేకరుల సమావేశంలో శ్రీరామమూర్తి తదితరులు

చోడవరం, ఏప్రిల్ 1 : జిల్లాలోని అనకాపల్లి ఎంపీ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం నియోజకవర్గాల వారీగా బీజేపీ సమన్వయకర్తలను నియమించినట్టు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గానికి పొన్నగంటి అప్పారావు, మాడుగులకు పుట్టా గంగయ్య, పెందుర్తికి పట్టాభి, చోడవరానికి ఈర్లె శ్రీరామమూర్తి, నర్సీపట్నానికి వర్మ, పాయకరావుపేటకు రవిరాజ్, ఎలమంచిలికి రాంబాబులను సమన్వయకర్తలుగా నియమించినట్టు చెప్పారు. వీరంతా ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేనలతో కలిసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేస్తారని ఆయన వెల్లడించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బత్తుల తాతయ్యబాబు, గూనూరు మల్లు నాయుడు, పెదబాబు, బొడ్డేడ గంగాధర్, గూనూరు మూలి నాయుడు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో ఎలమంచిలి మునిసిపాలిటీకి 10వ స్థానం



ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, ఏప్రిల్ 1: ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో ఎలమంచిలి మునిసిపాలిటీ మెరుగైన స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్రంలోని 127 మునిసిపాలిటీల్లో ఎలమంచిలి 10వ స్థానంలో, విశాఖ రీజియన్‌లోని 3వ స్థానంలో నిలిచిందని రెవెన్యూ విభాగం అధికారి తెలిపారు. మునిసిపాలిటీలోని మొత్తం 10,350 ఎసెస్‌మెంట్లు వుండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల 21 లక్షల రూపాయల ఆస్తి పన్ను వసూలు కావాల్సి వుంది. మార్చి 31వ తేదీనాటికి 2 కోట్ల 76 లక్షల రూపాయలు (86 శాతం) వసూలు చేశారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కశింకోట విద్యార్థికి కాంస్య పతకం



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన దిలీప్

కశింకోట, ఏప్రిల్ 1 : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 30, 31 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ స్కూలు విద్యార్థి కె.దిలీప్ అండర్-17 కేటగిరీలో 72 కేజీల బరువు ఎత్తి కాంస్య పతకాన్ని సాధించాడని తెలిపారు. ఇతనిని వ్యాయామ ఉపాధ్యాయుడు వి.ప్రభాకరరావు, అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419



రమేశ్‌నాయుడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

రమేశ్‌నాయుడు విజయానికి కృషిచేయాలి

» టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి మహేశ్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 1: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కిల్లు రమేశ్ నాయుడు విజయానికి కృషి చేయాలని పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి మహేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని పెదవలస, చాపరాతిపాలెం, రంపుల గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రమేశ్‌నాయుడును సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి అంతా కట్టుబడి ఉండాలన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవించాలన్నారు. పార్టీ నాయకులు వర్గ విభేదాల జోలికి వెళ్లరాదన్నారు. ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.బలరామ్, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ముక్కలి కల్యాణి, నాయకులు ఉల్లి రామారావు, బాలరాజు, వెంకటేశ్వర్లు, శోభ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ధారాలమ్మ జాతర ముహూర్తపు రాట



అమ్మవారి మహోత్సవాలకు ముహూర్తపు రాట వేస్తున్న దృశ్యం

సీలేరు, ఏప్రిల్ 1: గిరిజనుల ఆరాధ్య దైవం ధారకొండ ధారాలమ్మ 58వ వార్షిక ముహూర్తపు రాట కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో సాంబశివరావు, ధర్మకర్తల ఆధ్వర్యంలో వేదపండితుల పూజా కార్యక్రమాలతో అమ్మవారి ఉత్సవాల ముహూర్తపు రాటను వేశారు. అలాగే ఉదయం 9.22 గంటలకు అమ్మవారి గరగలకు చీరలతో అలంకరించి పూజలు చేశారు. వారం రోజుల పాటు ఈ గరగలను ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పువాడ, సీలేరు, ఒడిశాలోని చిత్రకొండ, బలిమెల ప్రాంతాలతో పాటు డొంకరాయి గ్రామాల్లో ఊరేగించి అమ్మవారి ప్రధాన పండగ రోజున ఆలయానికి చేరుకుంటాయని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, గణేశ్వరరాజు, భక్తులు పాల్గొన్నారు.

తోకరాయిలో వైద్య శిబిరం

జి.మాడుగుల, ఏప్రిల్ 1: గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలోని తోకరాయి గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో జ్వరాలు ప్రబలాయన్న సమాచారంతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి, మలేరియా పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రీమలి సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అందించాలని లబ్ధిదారుల ఆందోళన



గోమంగి సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పెదబయలు, ఏప్రిల్ 1: పింఛన్ సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ గోమంగి, గుల్లెలు పంచాయతీలకు చెందిన లబ్ధిదారులు సోమవారం ఆందోళనకు దిగారు. గోమంగి సచివాలయం ముందు ఈ కార్యక్రమం చేపట్టారు. గతంలో మాదిరిగానే తమ గడపకే వచ్చి పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. సచివాలయ అధికారులు స్పందించి పింఛన్ అందించాలని విన్నవించారు.

వలంటీర్ల నుంచి ట్యాబ్‌ల స్వాధీనం

» ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు యంత్రాంగం చర్యలు

» జిల్లా వ్యాప్తంగా 352 సచివాలయాల్లో 5,670 మంది వలంటీర్లు

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం గ్రామ వలంటీర్ల వద్ద ఉన్న ట్యాబ్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పథకాల లబ్ధిదారులైన ప్రజలను గ్రామ వలంటీర్లు ప్రలోభాలకు గురిచేయకుండా, వాటిని దుర్వినియోగం చేయకుండా ఉంచాలంటే తక్షణమే వాటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ జిల్లా ఎన్నికల అధికారులైన జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన యంత్రాంగం తక్షణమే గ్రామ వలంటీర్ల వద్ద ఉన్న ట్యాబ్‌లను గ్రామ సచివాలయం కార్యదర్శికి అప్పగించాలని, మండలంలోని అన్ని సచివాలయాల నుంచి సేకరించిన ట్యాబ్‌లను ఎంపీడీవోల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 22 మండలాల్లో 352 సచివాలయాల పరిధిలోని 5,670 మంది గ్రామ వలంటీర్ల వద్ద ఉన్న ట్యాబ్‌లను సచివాలయాల కార్యదర్శుల ద్వారా ఎంపీడీవోలు స్వాధీనం చేసుకున్నారు. వాటిని జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో భద్రపరుస్తారు.

గోదావరి డెల్టా రబీ పంటలకు నీరు విడుదల

... 5వ పేజీ తరువాయి

డొంకరాయి జలాశయం నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని రబీకి విడుదల చేయాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం డొంకరాయి జలాశయం నుంచి 6, 7 నంబర్ల గేట్ల ద్వారా నీరు విడుదల చేశామన్నారు. సీలేరు కాంప్లెక్సు నుంచి విద్యుదుత్పత్తి ద్వారా 3,500 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి లేకుండా జలాశయం నుంచి మరో 3,500 క్యూసెక్కులతో కలిపి మొత్తం 7 వేల క్యూసెక్కుల నీరు రబీ పంటలకు సీలేరు నుంచి విడుదల అవుతుందని ఆయన తెలిపారు. సీలేరు కాంప్లెక్సులో ప్రస్తుతం డొంకరాయి, సీలేరు (గుంటవాడ) జలాశయాల్లో 11 టీఎంసీలు, బలిమెలలో ఆంధ్రా వాటాగా 17 టీఎంసీలు కలిపి మొత్తం 28 టీఎంసీల నీటి నిల్వలు సీలేరు కాంప్లెక్సులో ఉన్నాయని, ఈ నీటినే జూన్ నెలాఖరు వరకు పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం గోదావరి డెల్టాకు అదనపు నీటి విడుదల నేపథ్యంలో బలిమెల నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్లు కేకేవీ ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఈఈ బాలకృష్ణ, ఏడీఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అరకులోయలో అయోమయం!

... 5వ పేజీ తరువాయి

టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థిని ప్రకటించిన తరువాత తమ అభ్యర్థిని ఉపసంహరించుకుంటున్నట్టు టీడీపీ ప్రకటించకపోవడంతో టీడీపీ అభ్యర్థిగా దొన్నుదొర కొనసాగుతున్నారు. అయితే బీజేపీ అభ్యర్థిని ప్రకటించిన తరువాత నుంచి దొన్నుదొర గ్రామాల్లో ప్రచారానికి వెళ్లడం లేదు. టీడీపీ అధిష్ఠానం నుంచి తనకు స్పష్టమైన సమాచారం వచ్చిన తరువాతే భవిష్యత్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని వేచి చూస్తున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం కూటమి పార్టీల శ్రేణుల్లో నెలకొన్న అయోమయానికి తెర వేయాలని పలువురు కోరుతున్నారు.

వడదెబ్బ నివారణ చర్యలు తీసుకోండి

శీతల పానీయాలు వద్దు.. సురక్షిత నీరు తాగండి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా

పాడేరు రూరల్, ఏప్రిల్ 1: జిల్లాలోని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందుబాటులో ఉంచామన్నారు. బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లు, వారపు సంతల్లో కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను వైద్యాధికారి, ఏఎన్ఎం, సిబ్బంది ప్రజలకు అందించాలని ఆదేశించామన్నారు. 108, 104 వాహనాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ తగిన వారిని వెంటనే 108లో సమీపంలోని ఆస్పత్రులకు చేరవేయాలని సూచించారు. వేసవిలో సురక్షితమైన నీటిని తాగాలని, ఐస్‌తో కూడిన చల్లని పానీయాలు తీసుకోకూడదని ఆయన సూచించారు. ఎండలో పనిచేసే కార్మికులు, కర్షకులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విశ్రాంతి తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిన వారికి తలనొప్పి, తల తిరగం, తీవ్రమైన జ్వరం రావడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి లక్షణాలుగా కనిపిస్తా



యని డీఎంహెచ్‌వో వివరించారు. మంచినీటిని ఎక్కువగా తాగాలని సూచించారు.

గిడ్డి ఈశ్వరికే టికెట్ ఇవ్వాలని టీడీపీ శ్రేణుల ర్యాలీ

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికే స్థానిక అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కోరుతూ టీడీపీ ముఖ్య నేతలు పాడేరులో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి ఇన్‌చార్జులు సోమవారం గిడ్డి ఈశ్వరి నివాసానికి చేరుకుని సమాశమయ్యారు. పార్టీ కోసం ఆరున్నరేళ్లు ఎంతో శ్రమించి, నియోజకవర్గంలో టీడీపీని తిరుగులేని స్థితికి తీసుకువచ్చిన గిడ్డి ఈశ్వరికి టికెట్ దక్కకపోవడం ఘోరమని కొయ్యూరు, జీకే వీధి మండలాల అధ్యక్షులు సత్యనారాయణ, రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధిష్ఠానం పునరాలోచన చేసి ఈశ్వరికే టికెట్ ఇవ్వాలని ముక్తకంఠంతో కోరారు. అనంతరం కుమ్మరిపుట్టు నుంచి పాడేరు మెయిన్‌రోడ్డు, ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కమిటీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాడేరు ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

చింతపల్లిలో...

చింతపల్లి: పాడేరు అసెంబ్లీ టికెట్ గిడ్డి ఈశ్వరికి కేటాయిస్తే విజయం తథ్యమని టీడీపీ సీనియర్ నేత, వర్తక సంఘం సబ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పెది రెడ్ల బేతాళుడు పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లగా కార్యకర్తలు, నాయకులను ముందుండి నడిపించడంలో ఈశ్వరి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. గిరిజనుల్లో వివిధ వర్గాల ప్రజలు, గిరిజనేతరులు, ఉద్యోగులు గిడ్డి ఈశ్వరి, చంద్రబాబుకు పూర్తి మద్దతుతెలుపుతున్నారన్నారు. అధిష్ఠానం క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈశ్వరి టికెట్ కేటాయించాలని కోరారు.

వైసీపీ నేతలు అసత్య ప్రచారం మానుకోవాలి

» సీపీఎం జిల్లా నాయకుడు త్రినాథ్



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథ్, పక్కన నాయకులు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 1: వనుగుమ్మ గ్రామానికి చెందిన పలువురు సీపీఎం నాయకులు వైసీపీలో చేరారని ఆ పార్టీ అసత్య ప్రచారం మానుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.త్రినాథ్ అన్నారు. సోమవారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనుగుమ్మ పంచాయతీ పరిధిలో పలువురు సీపీఎం నాయకులు వైసీపీలో జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం సమక్షంలో చేరారని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అది ఎంత మాత్రం నిజం కాదని ఆయన అన్నారు. సీపీఎంలో సభ్యత్వం పొందాలంటే రెండు సంవత్సరాలు పడుతుందని, వైసీపీలో చేరిన శుక్ర, మోహన్, గాసీ, వెంకటరావులకు సీపీఎం, ప్రజా సంఘాలతో ఎటువంటి సభ్యత్వం లేదని ఆయన పేర్కొన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారం మానుకుంటే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పి.భీమరాజు, కె.విక్రమ్, పి.సింగ్రు, పి.బేసు, ఎస్.సుందర్‌రాయ్, ఎస్.సంతన్న తదితరులు పాల్గొన్నారు.


టీడీపీపై వైసీపీ విష ప్రచారం

» సోషల్ మీడియా వేదికగా వలంటీర్లకు వైసీపీ నేతల మెసేజ్‌లు

» ఫింఛన్ల పంపిణీ టీడీపీ కారణంగానే ఆగిందని ఇంటింటికీ వెళ్లి చెప్పాలని వలంటీర్లపై ఒత్తిడి

రోలుగుంట, ఏప్రిల్ 1: ఎన్నికల వేళ అధికార వైసీపీ దుష్ప్రచారానికి పాల్పడుతున్నది. ఫింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికార పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంది. వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నది.

"వలంటీర్లకు ముఖ్యగమనిక. టీడీపీ నాయకుల ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన ద్వారా ఇంటింటికీ అందజేసే పెన్షన్లు నిలిపివేశారు. మన అవ్వ, తాతలకు బాధ్యతగా ఇచ్చే పెన్షన్ కార్యక్రమాన్ని ఆపింది టీడీపీయేనని ప్రతీ గడపకు వెళ్లి చెప్పండి. రెండు నెలల్లో జగనన్న ప్రభుత్వం మళ్లీ వస్తుంది. ప్రతీ నెల పింఛన్ ఇస్తాం అని చెప్పాలని మనవి" అంటూ రోలుగుంట మండలంలోని వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో, వైసీపీ సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. కాగా ఫింఛన్లను వలంటీర్లతో పంపిణీ చేయించొద్దంటూ టీడీపీయే ఇలా చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం రోలుగుంటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూడా ఆరోపించారు.



సోషల్ మీడియాలో వైసీపీ పోస్ట్ చేసిన మెసేజ్

తాండవ రిజర్వాయర్‌లో బోటు బోల్తా

» మత్స్యకారుడు గల్లంతు

» మరొకరిని కాపాడిన సహచరులు

గొలుగొండ, ఏప్రిల్ 1: తాండవ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు బోల్తా పడి ఒక మత్స్యకారుడు గల్లంతయ్యాడు. మరో వ్యక్తిని వేరే బోటులో వున్న సహచర మత్స్యకారులు రక్షించారు. దీనికి సంబంధించి ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడు పోతురాజు అందించిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని మండలం సాలికమల్లవరం పంచాయతీ శివారు పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు గరగల అప్పారావు, జన్ని పోతురాజు ఆదివారం రాత్రి పది గంటలకు రొయ్యల వేట కోసం తాండవ రిజర్వాయర్‌లో వల వేసేందుకు వెళ్లారు. కొంతదూరం వెళ్లిన తరువాత ఆకస్మికంగా బలమైన గాలులు వీచడంతో బోటు బోల్తాపడింది. అప్పారావు, పోతురాజు నీటిలో పడిపోయి కేకలు వేశారు. సమీపంలో మరో బోటుతో రొయ్యల వేట సాగిస్తున్న మత్స్యకారులు వచ్చి పోతురాజును రక్షించారు. అప్పారావు అప్పటికే నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారావు, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, రెవెన్యూ అధికారులు సోమవారం రిజర్వాయర్ వద్దకు వచ్చారు. గల్లంతైన అప్పారావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఎటువంటి ఆచూకీ లభించలేదు. అప్పారావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అప్పారావు అచూకీ కోసం కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు రిజర్వాయర్ వద్ద నిరీక్షించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, పలువురు నాయకులు వచ్చి పరామర్శించారు.



మత్స్యకారుడి కోసం గాలిస్తున్న పోలీసులు, మత్స్యకారులు

వైసీపీకి అధికారం ఇస్తే ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం

... 5వ పేజీ తరువాయి

ఎంపీ, ఎమ్మెల్యేలు సైతం కనీసం జీవో నంబరు-3పై మాట్లాడింది లేదన్నారు. గిరిజన జాతికి తీరని అన్యాయం చేస్తూ బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతూ వైసీపీ ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేసిందని, దీనికి గిరిజన ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారన్నారు. ఆదివాసీ గ్రామాలు, వ్యవసాయ భూములను ముంపునకు గురిచేసే యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేసి షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి కట్టబెట్టిందన్నారు. యర్రవరం పరిసర ప్రాంత ప్రజలు హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఏడాది పాటు ఆందోళలు, నిరసనలు చేపట్టినా గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించలేదని, వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు సీపీఎం పోటీ చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స తెలిపారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీతో సీపీఎం పొత్తు కొనసాగుతున్నదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలపై కోడ్ ప్రభావం

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన రెండు సమావేశాలకు ఎమ్మెల్యే హాజరుకాని పరిస్థితి ఏర్పడింది. అలాగే అధికారులు సైతం ఎన్నికలకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉండడంతో ఉత్సవాలపై దృష్టిపెట్టడం లేదు. ఫలితంగా మోదకొండమ్మ ఉత్సవాల తేదీలను ఖరారు చేసినా ఉత్సవాల సందడి కానరావడం లేదు. దీంతో ఉత్సవాలు ఎలా జరుగుతాయోననే ఆందోళన ఉత్సవ కమిటీ, భక్తుల్లో నెలకొంది.

అధికారులు కల్పించుకోవాలని వేడుకోలు

స్థానిక ఉత్సవాల నిర్వహణపై అధికార యంత్రాంగం కల్పించుకోవాలని ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు కోరుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ, ప్రతి ఏడాది జరిగే ఉత్సవాల నేపథ్యంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో వంటి అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఉత్సవాలకు సంపూర్ణంగా సహకరించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఇప్పటికే కలెక్టర్ విజయసునీతకు వినతిపత్రం అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సంపూర్ణంగా సహకరించకుంటే ఉత్సవాల నిర్వహణ భారంగా మారడంతోపాటు ఉత్సవ వైభవం సైతం కోల్పోతుందని భక్తులు అంటున్నారు. తాజా పరిస్థితి నేపథ్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు పూనుకోవాలని పలువురు కోరుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

'పింఛన్ల పంపిణీలో టీడీపీపై దుష్ప్రచారం సరికాదు'

జి.మాడుగుల, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీ విషయంలో ప్రతిపక్ష టీడీపీపై వైసీపీ దుష్ప్రచారం చేయడం సరికాదని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు హితవుపలికారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి టీడీపీ వ్యతిరేకం కాదని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం వలంటీర్లు పెన్షలు పంపిణీ చేయకూడదని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ప్రజలకు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇవ్వడం వైసీపీకి మంచిది కాదని ఆయన హితవు పలికారు.

ఐటీడీఏ క్యాంటిన్ అద్దె తగ్గించాలి

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలోని క్యాంటిన్ అద్దెను తగ్గించాలని నిర్వాహకులైన మహిళలు అధికారులను వేడుకుంటున్నారు. ఐటీడీఏలోని దివంగత ఐఏఎస్ అధికారి శంకరన్ పేరిట మూల్ నివాసీ మహిళా సంఘం ప్రతినిధులు 2016 నుంచి క్యాంటిన్ నిర్వహిస్తున్నారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా నిర్వహిస్తున్న ఈ క్యాంటిన్‌కు అద్దెను పెంచాలని ఐటీడీఏ అధికారులు నిర్ణయించారు. గతంలో వున్న అద్దెతోనే క్యాంటిన్ నిర్వహణ కష్టతరంగా ఉందని, ఈ నేపథ్యంలో అద్దె పెంచవద్దని మహిళలు కోరుతున్నారు.

'వైసీపీతోనే గ్రామాల అభివృద్ధి'

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వంతోనే మారుమూల గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని మారుమూల వనుగుమ్మ, సంగడ, దోడిపుట్టు, బరడ పంచాయతీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన 'మేము సిద్ధం-మా బూతు సిద్ధం' కార్యక్రమానికి ఆమెతో పాటు అరకు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం హాజరయ్యారు. గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన చేరిన వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, నాయకులు ఎ.జగబంధు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఉద్యోగికి సత్కారం

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగో తరగతి ఉద్యోగిగా విధులు నిర్వహించి సోమవారం విరమణ పొందిన వంతాల పండన్నకు ఘనంగా వీడ్కోలు పలికారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పండన్న దంపతులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ప్రిన్సిపాల్ సుజాత కొనియాడారు. అనంతరం అతన్ని పాలిటెక్నిక్ కాలేజీ నుంచి సుమారు గా రెండు కిలోమీటర్లు దూరంలోఉన్న స్వగృహం వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ సిబ్బంది, పండన్న కుటుంబీకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

చింతపల్లి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు చేయూత వారియర్స్ ప్రతినిధులు దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో 30 మందికి హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం చేతులమీదుగా సోమవారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారియర్స్ ఛైర్మన్ డి.రమణ మాట్లాడుతూ వ్యక్తిగత నిధులతో అనాథలకు, పేద గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈకార్యక్రమంలో వారియర్స్ ప్రతినిధులు ఇమ్మంది మోదగిరి, సాగిన జగన్ పాల్గొన్నారు.

'వైసీపీ అభ్యర్థులు పద్ధతి మార్చుకోవాలి'

పెదబయలు, ఏప్రిల్ 1: వైసీపీ అరకు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు పద్ధతి మార్చుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, ఎంపీపీ బొండా వరహాలమ్మ పేర్కొన్నారు. ఇక్కడి మండల వైసీపీ ముఖ్య నేతలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించి 20 రోజులైనా మండలంలో ఒక్క సమావేశం నిర్వహించకపోవడం దారుణమన్నారు. అలాగే వైసీపీ మండల నాయకులను కనీసం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలానే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉమమహేశ్వరరావు, సర్పంచులు మత్స్యరాజు, రవిశంకర్, వెంకటరావు, కృష్ణరావు, లోవిదాసు, భాస్కర్, నాయకులు వినోద్, కొండబాబు, కృష్ణపడాల్, చంద్రుడు, రామన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ టికెట్ ప్రసాద్‌కు కేటాయించాలి'

చింతపల్లి, ఏప్రిల్ 1: టీడీపీ టికెట్ ఎంవీవీ ప్రసాద్‌కి కేటాయించాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం చినరాజు పాకలు గ్రామంలో టీడీపీ నాయకులు, మహిళలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎంతో కాలంగా కార్యకర్తలు, నాయకులతో కలిసిపని చేసిన వారికి టికెట్ కేటాయించాలన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రజల మద్దతు కలిగిన ఎంవీవీ ప్రసాద్‌కు టికెట్ ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అరకు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి బేరా సత్యనారాయణ, పార్టీ నాయకులు పొత్తూరు రాంబాబు, గొర్లె వెంకట రమణ, నల్లి ఎర్రయ్య బోనంగి బంగారు పడాల్, బడిమెల బంగారయ్య పాల్గొన్నారు.

అరకు టికెట్‌పై పునరాలోచించాలి

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 1: అరకు అసెంబ్లీ టికెట్ కేటాయించడంపై అధిష్ఠానం పునరాలోచించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం కోరారు. పార్టీ నాయకులతో కలసి సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దొన్నుదొరకు టికెట్ చంద్రబాబు టికెట్ ప్రకటించడంతో పార్టీ క్యాడర్ ఎంతో ఉత్సాహంతో పనిచేస్తున్నారని, గ్రామ గ్రామానతిరిగి పార్టీ బలోపేతానికి పాటు పడుతున్నారని చెప్పారు. దొన్నుదొర గెలుపు తథ్యమనుకున్న తరుణంలో అనూహ్యంగా బీజేపీకి టికెట్ కేటాయించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం ఆలోచించి దొన్నుదొరకు టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్‌గా అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.జగత్‌రాయ్, ఎస్.బాబూజీ, వి.లక్ష్మణ్, ఎస్.శంకరావు, ఆర్.కొండలరావు, ఎం.సీతారాం, ఎం.గోపాల్, ఎల్.సిల్దేశ్, కె.కామరాజు, కె.సిబో, కె.సహదేవ్, డొంబు, అభిలాష్ పాల్గొన్నారు.